"అంతేలే! పెళ్ళెయ్యాక ఆ ఏడుపేదో నువ్వే ఏడువ్ అని మా నుదుటిపైన ఇంటెలిబుల్ ఇంక్‌తో రాశాడు బ్రహ్మ. తప్పుతుందా?" అన్నాడు హరి.

"జోకా! నవ్వనా?" అడిగింది సీత

, "నీ ఇష్టం కానీ త్వరగ్గా మీ భాస్కరుని వృత్తాంతంబు వినిపించిన నేను పేపర్ పఠనమునకు ఏగెద" ఇటీవలే చదివిన వినాయకవ్రతకల్పంలోని పంక్తుల్ని అనుకరించాడు హరి.

"సంభాషణ పక్కదోవ పట్టించడంలో మీరు మంచి. ఎక్స్‌పర్టే. ఎంతదాకా చెప్పాను? ఆ... అతను నేసిన చీరలు బాగా ఫేమస్‌ట. మా సువర్ణకి తెలిసినవాడు కాబట్టి అరు ఇన్‌స్టాల్‌మెంట్లలో 1200లకే ఇచ్చాడు. మైసూరు శిల్కు చీరలు. చాలా రోజుల్నుండీ మోజుపడ్డ కలర్‌లో దొరికింది. కొనేశాను. ఎంతా! నెలకి రెండువందలేగా? మనకొచ్చే ఐదువేలల్లో నెలకి ఓ రెండొందలు కట్టలేమా? చీర చూడండి ఎంత బాగుందో! నా ఒక్కదాని చీరకే బ్లౌజ్‌కూడా ఉంది. అందరూ నాక్కావాలంటే నాక్కావాలన్నారు.నేను సెలెక్ట్ చేసుకున్నాను. నేనే తెచ్చుకున్నాను." గర్వంగా చెబుతూ బెడ్‌షీటు మాటున దాచిన చీరని తీసింది సీత.

హరి దగ్గరనుండి ఏం సమాధానం రాకపోయేసరికి తలెత్తి అతన్నిచూసింది సీత. అసహనాన్ని నొక్కి పెడుతున్నట్లుగా అతని ముఖకవళికలే చెబుతున్నాయి. బలవంతంగా మొహం మీదికి నవ్వు తెచ్చుకుంటూ "సారీ అండీ! ఖర్చుల్లో ఖర్చు! అయినా ఈ చీర దీపావళికి కట్టుకుంటాను. కాదనకండీ! నాకెంత నచ్చిందో! చూడండీ" గోముగా అతని దగ్గరిగా జరిగింది సీత.

"చూడు సీతా! నిన్ను చీరలు కొనొద్దనలేదు. కానీ ఆ చీర వాయిదా ఎలా తీరుద్దామని అనుకుంటున్నావు?"

"ప్రస్తుతం మనకున్న అప్పులు తీర్చడానికే వచ్చిన జీతం సరిపోతోంది. పనిమనిషికి నూటాభై, పాలకి మూడొందలు, ఇంటి అద్దె పదిహేను వందలు, స్కూటర్ వాయిదా వెయ్యి, స్టీలు సామాన్ల వాయిదా రెండొందలు, మొన్న చేయించుకున్న ముత్యాలగొలుసు వాయిదా రెండొందలు, బాబిగాడి స్కూలు ఫీజు, వెచ్చాలు, సాదరు ఖర్చులు పోను మనకి మిగిలేదెంత?" సూటిగా అడిగాడు హరి.

"అది కాదండీ! ఒక్క రెండొందలు. పోనీ... నేను రోజూ బస్సులో ఆఫీసుకి వెళతాను. ఆ డబ్బు చీరకి పెట్టాననుకుంటాను" అంది సీత.

"అబ్బా! అర్థం చేసుకో సీతా! మొన్నటికి మొన్న వెంకటగిరి చీరకొన్నప్పుడూ, స్టీలు డ్రమ్ము కొన్నప్పుడూ ఇలాగే బస్సులో వెళతానన్నావు. నీకు నెలకి ఆఫీసు కెళ్ళడానికి ఖర్చు మూడొందలు ఈ ఇన్‌స్టాల్‌మెంట్లు వెయ్యి. అన్నీ మూడొందల్తో తీరతాయా? ఇలా అయితే మనం మన ఇంటికి సామాన్లెప్పుడు కొనుక్కుంటాం?" అడిగాడు హరి.

"అంతేలెండి! ఉద్యోగంచేసి నెలకి మూడువేలు సంపాదిస్తున్నానన్నమాటేగానీ నెలకి ముప్ఫైరెండొందలు పడేసి చీరకొనుక్కోలేను. అదే మా ఆఫీసులో ఆడవాళ్ళని చూడండి. కోరిన నగా, కట్టిన చీరా! ఎందుకొచ్చిన బతుకు మనది?" అంది సీత.

"నిజమే సీతా! కానీ మనిద్దరం అవినీతిపరులం కాదు. ముందు ముందు ఏదైనా కొనాలంటే డబ్బొద్దూ! నాకా మీ వాళ్ళిచ్చే కానుకల మీదా ఆశలేదు. రెక్కల కష్టంతో అన్నీ సంపాదించుకున్నామన్న తృప్తి నాక్కావాలి. కొద్ది రోజులాగితే నేనే నీకన్నీ కొనిపెట్టనా?" అనునయంగా అడిగాడు హరి.

"కొన్నారులెండి బోడి! పెళ్ళైన కొత్తల్లో కొన్న చీరలు తప్ప ఎప్పుడైనా ఇదిగో సీతా నీకోసం అని ఓ మూర మల్లెపూలు తెచ్చారా? పైగా నా అంతట నేనే కొన్నా..." అర్థోక్తిలో ఆపేసింది సీత దుఃఖం ముంచుకొస్తుంటే.

"నువ్వు చీరకొన్నావనినేను ఏడుస్తానా బుజ్జీ? నువ్వడిగింది ఏది కాదన్నాను చెప్పు. పోన్లే! ఈసారికి చీర ఉంచుకో! ఈ అప్పు తీరేదాకా ఇంకేం కొనకు. ఒకదాని తర్వాత ఒకటికొంటే మనకే హాయికదా! నచ్చచెప్పబోయాడు హరి.

"ఆ! ఏం అక్కర్లేదు. ఎంతో మోజుపడి కొన్న చీర కానీ కట్టుకున్నప్పుడల్లా మీరు అన్నమాటలే గుర్తొస్తాయి. నాకు ప్రాప్తం లేదు. అంతే!" నిష్ఠూరంగా అంది సీత.

"ఒద్దు సీతా! ఏడవకు! చీర ఉంచుకో! చీరకొన్నందుకు కాదు! కానీ మన పరిస్థితి కాస్త అర్థం చేసుకో! అప్పులు తీరాక నీకే చీర కొనాలన్నా కొనుక్కో. కానీ ఒకళ్ళ దగ్గర మాట పడటం నాకిష్టం ఉండదు" ఖచ్చితంగా చెప్పాడు హరి.

అంతే! చీరతీసి బీరువాలో ఉంచి హాయిగా నవ్వింది సీత. ఇంతకీ ఇద్దర్లో ఎవరు గెలిచినట్లు అన్నదే నాకర్థం కాలేదు. ఆలోచిస్తుంటే కాలు గీరినట్లైంది. ఉలిక్కిపడి కిందికి చూస్తే గుండ్రనితోక ఊపుతూ మా కుక్క రాకీ! నిజమే! చెప్పడం హరికి తప్పదు. వినకపోవడం సీతకూ తప్పదు. కుక్కతోక వంకరెందుకో! రైటర్నైన నాకేఅర్థం కాదు! మీకు తెలుసా పోనీ?

★

# ఆదర్శం

-హైమ

భాస్కరరావు ఒక రచయిత. అతని రచనలు అనేక పత్రికల్లో అచ్చయ్యాయి. పాఠకుల ఆదరణ బాగా లభించింది.

ఎంతగా లభించిందంటే భాస్కరరావుకి ఎంతో మంది అభిమానులు ఏర్పడ్డారు. వాళ్ళు అస్తమానం ఉత్తరాల ద్వారా తమ అభిమాన రచయితను పలకరిస్తూ ఉంటారు.

రచనా ప్రపంచంలో భాస్కరరావు మొదట్నుంచీ లేడు. ఇటీవలే అతను రచనా వ్యాసంగం ప్రారంభించాడు.

అయినా తన నిర్మొహమాటమైన అభిప్రాయాలతో వాడి, వేడి రచనలతో, వాటిలో గుప్పించే ఆదర్శాలతో అతను అతి తక్కువ సమయంలో రచయితగా విజృంభించి విశ్వరూపం చూపించాడు.

తోటి రచయితలకి కూడా అతనంటే ఒక ఆశ్చర్యమే! ఇలాంటి అద్భుతాలు ఎలా సాధించగలుగుతున్నాడూ అని!

ఒకే రచయిత దాదాపుగా అన్ని వార, మాస, పత్రికల్లో ఏదో రకంగా ఒకేసారి కనపడ్డం అనేది సాధారణ విషయం కాదు.

అలాంటి అద్భుతాన్ని భాస్కరరావు చేసి చూపెట్టాడు. అంతేకాదు - రచయిత అనేవాడికి స్వంతంగా కొన్ని ఆదర్శాలుండాలి అనే విషయాన్ని పదే - పదే తన రచనల ద్వారా తెలియజేసి అభిమానుల్ని ఆకట్టుకున్నాడు.

అలాంటి భాస్కర రావు రచనా విశిష్టతకి నేను కూడా ఆకర్షితుడి నయ్యాను.

ఈ మధ్యనే అతని పర్చేజ్ ఆఫీసులో రాంబాబు అనే నా స్నేహితుడు కలిశాడు. మాటల సందర్భంలో భాస్కర రావు విషయం ప్రస్తావనకు వచ్చింది.

"ఓ... ఆ భాస్కర్రావా! వాడొట్టి డాంబికుడు. ఆఫీసులో ఏపనీ సరిగ్గా చేయడు. పని ఎగ్గొట్టి, ఇటు ఆఫీసర్నీ, అటు పబ్లిక్‌నీ ఏడిపించుకుతింటాడు. వీడు చెప్పే ఆదర్శాలన్నీ ఉత్త పోసుకోలు కబుర్లు..." అంటూ చెప్పుకుపోతోన్న రాంబాబుని ఆశ్చర్యంగా చూస్తుండిపోయాను నేను.

★

ఆకెళ్ళ గిరిజ
21-138-2, ఫ్లాట్ నం.41
ఉత్తమ్‌నగర్, I క్రాస్,
హైదరాబాద్-47.